కవితా కౌముది

# రైతు హాలిడే

డా.రమణ యశస్వి

**పొలంతో వేసవి ఎడబాటు కాలాన్ని**
ఆశల కొడవళ్ళతో కోసేసి,
ఋతు రాగాలను ఆలపిస్తూ
బీడు భూమిలో
నెర్రె లిచ్చిన నేలపై పడుకొని,
వేల కళ్ళ ఆకాశంవైపు వేయి కళ్ళతో
ఎదురు చూస్తున్న కర్షక జీవికి -
మేఘాలు వురితాళ్ళను పేనుతున్న శబ్దం
ఉరుములై గర్జిస్తుంటే ,
అన్నదాత కనురెప్పలు ప్రమాద సూచికలై
రెప రెప లాడుతో
వర్షిస్తున్న కళ్ళను ఓదారుస్తున్న దృశ్యం
మెరుపులా ఆవిష్కరించబడుతోంది!
గగన కాన్వాసుపై రాలిన చినుకు
మరుజన్మ రైతన్న కంటిలో అన్నట్లు
జలజల రాలిన కన్నీరు
ఎడమ భుజంపై కండువాని తడిపేసి
ఈ కాసేపన్నా చల్లంగుండు బాబాయి
అని దీవించినట్లుంది!
కండువా కుడి భుజంపైకి మార్చుకొని
తడబడుతున్న అడుగులతో
తను బలం పెట్టి పోషించిన నేలతల్లిని తాకి
'ఋణం తీర్చుకోలేనమ్మా '
అంటూ ఇంటి ముఖం పట్టాడు !

కడుపులో ఎలుకలు పరుగిడుతుంటే
తను నడుస్తున్నాడు !
ఏసీ రూముల్లో వారి బొజ్జలు నింపిన తన రెక్కలని
ఎండిన డొక్కలు వెక్కిరిస్తుండగా
అమ్మాయి పెళ్ళి, అబ్బాయి చదువు , అప్పులు
నకిలీ విత్తనాలు, కరెంటు కోత, ఎండిన కాలవ
గుర్తొస్తుండగా
నడుస్తూనే వున్నాడు!
పంట విరామం అని తెల్సుకొని విస్తుపోయి
పురుగు మందు కొట్టిన చేతులతో
పుడమి తల్లి చేదు మందు తను తాగేసాడు!
అది నకిలీదని, ప్రాణం పోదని తెల్సుకొని
తడిసిన కండువా మెడలో బిగించి
పశువుల కొట్టంలో
రాజకీయ బలిపశువు అయ్యాడు !
క్రాప్ హాలిడే కాదు హాఫ్ హాలిడే కాదు
ఫుల్ శలవు ప్రకటించాడు
వికటించిన బ్రతుకు బండి ఈడ్చలేక
మరో కష్టజీవి మరో బడుగు
మరో ప్రపంచంలోకి తడిసిన కండువాతో !! ***



# అందమైన ప్రశ్న
శుభ

**అధరాలలో మధువును నింపుకున్న**
పూల కన్నెలను అడుగు
కొంటె తుమ్మెద ఏమని పలుకరిస్తోందో.,
కదిలే అలలను అడుగు
గాలికి ఏ వలపుల వలలను వేస్తున్నాయో.,
కొమ్మ కొమ్మను పెనవేసిన తీగెలను అడుగు
కౌగిలింతలోని గిలిగింత ఏమిటో.,
పిల్ల తెమ్మెరలను అడుగు
వేణువులోని తీయని రాగం ఎక్కడిదో.,
నా కనుల కొలనులోని దాగిన
నీ జ్ఞాపకాలని అడుగు
నా మనసుకు ఈ పరవశం ఎందుకో ! ! !

***



# విలోమగమనం
రావెల పురుషోత్తమ రావు

**అలా వెనక్కు నడుచుకుంటూ**
తిరిగిచూడకుండా వెళ్ళిపోతే
వృద్ధాప్యం కేరింతలుకొడుతూ
యవ్వన రూపురేఖలుదాల్చి
చెంగు చెంగున దుముకుతూ
సొగసుల సోయగాలతో
ముందుకు గెంతుతుంది!
యవ్వనం మాత్రం ససేమిరా
బాల్యం వైపుకు అడుగులువేసే ప్రసక్తేలేదని
మొండికేస్తున్నది!
ప్రణయ ద్వారాలు మూసుకుపోతుంటే
ససేమిరా ఒప్పుకోనని మొరాయించడం
మొదలెడుతుంది!
బాల్యం మాత్రం అనూహ్యంగా
శైశవం వైపు బిరాన పరుగెడతానని
ఉత్సాహంతో ఉరకలు వేస్తూ
ఉవ్విళ్ళూరడడం మొదలెడుతుంది!
మాతృస్తన్య మాధుర్యాన్ని
మరోమారు తనివితీరా గ్రోలవచ్చునని
అణువణువునా క్షణాలకోసం ఆశగా
ఎదురుచూస్తుంది!
తిరోగమనంలో యింత తీయదనం వుంటుందా అని
ఆశ్చర్యపోవడం అందరివంతవుతుంది.

***

# కొంతమంది ఎన్నారైలు డా.మూర్తి జొన్నలగెడ్డ

**ఊరుకాని ఊరులోన**
అపరిచితుల సేవలోన
మునిగి తేలు తెలుగు సేన
సూటేసెను బూటేసెను
చిరునవ్వుల ముసుగేసెను
తియ్య మాటల తేనె పూసెను
రెక్కాడగ డొక్కాడెను
యంత్రములా పనిచేసెను
లోకమ్ లే లోకమాయెను
జీతములే జీవితమాయెను
సొమ్మెంతయొ వెనకేసెను
సొంతూరుకి పంపేసెను
షేరులెన్నొ కొనివేసెను
ఇళ్ళన్నీ తనవేను
అద్దెలన్ని జమచేసెను
స్నేహాలను సరితూచెను
బంధుత్వము మరి మరచెను
పిల్లలు మరి పెరిగేను
ప్రైవేటు స్కూలాయెను
తేటతెనుగు చేదాయెను
మెడిసిన్లో సీటంటెను
అందరికీ రాకుండెను
తనదేశము పంపించెను
డొనేషన్లు చదివించెను
పెళ్ళీడు రానె వచ్చెను
కుర్రాడు బానె నచ్చెను
హోదాలను సరిపోల్చెను
కట్న కానుకలు తెగ రాల్చెను
కొడుకేమో అందొచ్చెను
కూతురెళ్ళి కోడలొచ్చెను
బాబ్డ్ హెయిరు కోడళ్ళు
అత్తగారి ఆరళ్ళు
చిన్న వంక మరి చాలు
వేరు వేరు కాపురాలు
తల నెరిసెను
పను కదిలెను
తన వారలు దరిలేరను
తన ఊరిని వదిలేనను
బెంగ మరీ పెరిగేను
నిద్రసలే కరువాయెను
ఒక రాత్రి కలలోను
ఆ రాముడు అనియేను
ఇన్నాళ్ళుగ ఇన్నేళ్ళుగ
నీ లోను నీవేను
ఇకనైనా ఇపుడైనా
నా మాటను విను విను
పంచుకుంటే పెరిగేను
సుఖాలన్ని అందరితోను
పంచుకుంటె తరిగేను
కష్టాల బరువేను
నలుగురితో కలిస్తేను
అందరికీ పండగేను
ఊరంతా సందడేను

***

# వ్యత్యాసం

ఉమాదేవి పోచంపల్లి

**భగభగమండె గ్రీష్మంలో,**
వడగాడ్పుల తాకిడిలో,
బీటలు బారుతున్న
భూమినుండి వీస్తున్న
వీచికలో వడలిపోతున్న నాకు,
ఊహల చిరుగాలి స్పర్శలో
వర్షాకాలంలో విరిసే
తెల్లనికలువల మెల్లని
సుగంధం కనుగొనాలని -
నీలాకాశంలో మేఘాలపైన
పాలసముద్రంలో
పయనించే నౌకలా,
కాలంతో బాటుగా
యానంచేస్తున్న
ప్రభాతకిరణాలలో,
విహంగాలతో వెళ్ళే
విమానంలోంచి,
మంచులో తడిసిన
ప్రపంచాన్ని దర్శించాలనీ
వర్షంలో తడవాలనీ -
ప్రళయకాలంలా
విజృంభిస్తున్న
వాయుగుండంలోంచి,
సుడులు తిరుగుతూ
వడితిరుగుతున్న
తీవ్రవరదల్లో,
భూమ్యాకాశాలు
విచ్ఛేదించే విద్యుల్లతా
తోరణాల్లో పరిభ్రమిస్తూ,
కాళరాత్రిలా
నల్లని మబ్బులు క్రమ్మి
నేల జారిపోతుంటే,
పట్టు చిక్కక కొట్టుకుపోతూ
ఆక్రందిస్తూ ఆక్రోశిస్తూ,
క్షేమంగా ఉంటే చాలనుకునే
తాళలేని ప్రాణాలు కొన్ని..!!

***



Fame is a bee.
It has a song --
It has a sting --
Ah, too, it has a wing

**by Emily Dickinson**

# గొల్లపూడి మారుతిరావుగారి స్వేచ్ఛానువాదాలు

## కీర్తి

తేనెలు చిందే భ్రమరం
ఝుమ్మనే నాదాన్ని పంచుతుంది
పరాకుగా ఉంటే కాటు వేస్తుంది
అన్నీ ఫరవాలేదని అహంకరిస్తే
రెక్కలు విదిలించి ఎగిరిపోతుంది!

## కీర్తి

జీవన చైతన్యానికి స్ఫూర్తి
సునాదాన్ని నినదించే భ్రమరం
అదాటుగా ఉంటే కాటువేసే సమరం
మత్తెక్కించే తేనెలు పంచే నేస్తమే కానీ
నిలుపుకోలేకపోతే రెక్కలు విదిలించే విపర్యయం

## పేరు

మీగడ చిలికిన పేరునెయ్యి
నాలిక తగిలితే స్వర్గం కనిపిస్తుంది
రుచి మరిగితే కృంగదీస్తుంది
నమ్ముకుని కళ్ళు నెత్తికి రానివ్వకండి బాబూ..
నమ్మి వెంటబడితే అది లోతు తెలియని పెద్ద గొయ్యి!

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

**పెరటిలో చెట్టు నన్నటు పిలుచుచుండు**
చేరి నాతోడ నేమొ భాషించుచుండు
తనదు చల్లని ఛాయలో మనము నిలిచి
కోయిలల పాట విన్నది గుర్తు చేయు

**చెట్టు కొమ్మల దాగు రాచిలుక సొగసు**
ఎదను తాకెడు గండు తుమ్మెదల రొదలు
మనసు హరియించు కొలని తామరల సొబగు
ప్రకృతి యందములెల్ల జ్ఞాపకము చేయు

**ఏవొ నాదముల్ చేయు నీ వృక్షతతులు**
ఏవొ సందేశములనిచ్చునెల్లరకును
వనములందున కొండల పట్టణముల
ఏవొ భావమ్ముల పెగుల్చునెడదనుండి

**ఒక్కటొక్కటే తామెల్ల యూరు విడచి**
మనలనొంటరి చేసి కన్మరగు వేళ
వెడలు భ్రమరముల్ శుకములు పికములన్ని
మనల విడచి యీ రసహీన వనమునందు

**వెడలనీయకు తరులను విరులనెల్ల**
వెడలనీయకు పూల పుప్పొడులనెల్ల
వెడలనీయకు శుకముల పికములెల్ల
చెలియ! రమ్మిటు వనిని రక్షించుటకును

POST YOUR COMMENTS